వందే మట్టి గణపతి

జోరందుకున్న మట్టి నాయక విగ్రహాల తయారీ

వినాయక చవితి ఉత్సవాలకు నగరం సిద్ధమవుతోంది. పండుగలు, సంప్రదాయాల పరిరక్షణతోపాటు సామాజిక బాధ్యతను కూడా తీసుకోవాల్సిన తరుణమిది. కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు కలిగించే పద్ధతులను పక్కనపెట్టి పర్యావరణహిత గణపతులకు ప్రాధాన్యమిద్దామంటున్నారు నగరవాసులు. నవరాత్రి ఉత్సవాలను ఈసారి పర్యావరణ హితంగా జరుపుకోవాలన్న స్పృహ అన్ని వర్గాల్లో పెరిగింది. దీంతో మట్టి గణపతుల విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు విగ్రహ తయారీదారులు. –కంచరపాలెం


మట్టితో చేసిన వినాయకుడు విగ్రహాలతో కళాకారుడు


విగ్రహానికి రంగులు వేస్తూ..

వినాయక చవితి అంటే పిల్లల నుంచి పెద్దల వరకు ఎంతో ఉత్సాహం చూపుతారు. సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభంకానున్న వినాయకచవితి నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని నగరంలో వినాయక విగ్రహాల తయారీ జోరందుకుంది. విగ్రహాల తయారీలో వాడే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లో చేసిన విగ్రహాలు వినియోగిస్తుండడంతో వాతావరణం కలుషితం అవుతోంది. అందుకే గత కొద్దికాలంగా మట్టి వినాయక విగ్రహాలవైపే విశాఖవాసులు మొగ్గుచూపుతున్నారు. వాటికే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికార యంత్రాంగం కూడా అవగాహన కల్పిస్తోంది. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి గత ఏడాది నగరంలో పలు చోట్ల సేవా సంఘాల కార్యకర్తలు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసిన విషయం తెలిసిందే.

పర్యావరణానికి ఉపయోగకరంగా..

వాతావరణం కలుషితం కాకుండా పర్యావరణ పరిరక్షణకు తాము సైతం అంటున్నారు విగ్రహ తయారీదారులు. కోల్‌కతా, ఒడిశాల నుంచి వలస వచ్చిన కొంత మంది కళాకారులు కంచరపాలెం పరిధిలోని పరమేశ్వరి థియేటర్ ఆవరణ, మళ్లసూరివీధి, ధర్మనగర్, రామ్మూర్తిపంతులుపేట, 104 ఏరియా, పైడిమాంబకాలనీ, జ్ఞానాపురం, బుచ్చిరాజుపాలెం, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో మట్టితో చేసిన విగ్రహాలను మాత్రమే తయారు చేస్తున్నారు. అంతేకాదు రసాయనాలు లేని సహజ రంగులను మాత్రమే ఉపయోగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలనే ఉద్దేశ్యంతో తమంతట తామే మట్టి విగ్రహాల తయారీకి పూనుకున్నారు.

ఆకట్టుకునే విధంగా..

భక్తులను ఆకర్షించే విధంగా విగ్రహాలు తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు. మామూలుగా వినాయక విగ్రహాలను వైట్ సిమెంటు అచ్చుల్లో వేసి తయారు చేస్తారు. వీరుమాత్రం చేతితోనే విభిన్న ఆకారాల మట్టి విగ్రహాలను తయారు చేయడం విశేషం.

ఎన్నో ఏళ్లుగా ఇదే వృత్తి



మాది ఒడిడా రాష్ట్రంలో ఓ మారుమూల గ్రామం. పాతికేళ్ల క్రితమే విశాఖ వచ్చేశాం. తండ్రి నుంచి వారసత్వంగా విగ్రహాల తయారీ చేపట్టాను. కష్టమైనా, నష్టమైనా వీటిని తయారు చేస్తూ జీవిస్తున్నాం.

–సుధీర్‌పాల్, కళాకారుడు. కోల్‌కత్తా

తయారీలో ఎంతో సంతృప్తి



బొమ్మలు తయారు చేసి ఉపాధి పొందుతున్నాం. చిన్ననాటి నుంచి విగ్రహాల తయారీలో శిక్షణ పొందాం. పండగ సమయాల్లో కుటుంబాన్ని విడిచి ఎనిమిది నెలలు విగ్రహాలు తయారు చేస్తాం. డబ్బు సంపాదించి ఇళ్లకు చేరుతాం. నాతో పాటు అనేక మంది కళాకారులు ఇదే వృత్తిగా నమ్ముకుని బతుకుతున్నారు.

– వక్కయ్‌పాల్, కళాకారుడు, ఒడిశా

విగ్రహాలకు డిమాండ్ ఉంది

భక్తులు కూడా మట్టి విగ్రహాలనే కోరుకుంటున్నారు. అయితే వీటి తయారీకి చాలా కాలం పడుతుంది. కరోనా కష్టకాలం తరువాత మట్టి బొమ్మలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే తయారు చేసిన విగ్రహాలు 95 శాతం ఆర్డర్లు దక్కించుకున్నాం. బొమ్మలపై మట్టి ఆరిపోయిన తరువాత సహజసిద్ధమైన రంగులు వేయడం మొదలు పెడతాం.

–రాంబాబు, విగ్రహాల తయారీదారుడు

తేనె వంటిది తెలుగు భాష


మాట్లాడుతున్న లెక్చరర్ రేణుక


పాఠశాలలో దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు


సమావేశంలో మాట్లాడుతున్న నల్లనయ్య

సీతంపేట: తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా అక్కయ్యపాలెంలోని మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చోడవరం జూనియర్ కళాశాల లెక్చరర్ రేణుక కిషోర్ మాట్లాడుతూ గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజలవాడుక భాషలోకి తీసుకు వచ్చిన మహనీయుడు గిడుగు రామమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సభాధ్యక్షుడు మళ్ల వెంకటరావు, బండే వేంకటేశ్వరరావు, కె.రాజేష్, అశ్విని, సత్యారావు, ట్రస్టు సభ్యులు తెలుగు సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు జయంతి

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి పంతులు 160 జయంతి కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గిడుగు చిత్రపటానికి, తెలుగు తల్లి చిత్రపటానికి క్లబ్ పూర్వాధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య పూలమాల వేశారు. కార్యక్రమంలో లలితా రెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం, సత్తి సునీల్ రెడ్డి, కృష్ణారావు, ఆశపు నూకరాజు, సుబ్బారావు, విజయానందరావు, వాకర్స్ క్లబ్ కార్యదర్శి లంకా సుధాకర్ ,ఉపాధ్యక్షులు మళ్ల రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు ప్రకాశరావు, వడ్డాది అప్పారావు, నాగేశ్వరరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మహిళావాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీమాధవ విద్యాలయంలో నిర్వహించిన నిర్వహించిన తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్, డాక్టర్ ఫరూఖ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత సంబంధ వ్యాధులపై పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 ఎలక్ట్ గవర్నర్ టి.రంగారావు, పూర్వ గవర్నర్ జి.సూర్యనారాయణ, బి.సత్యనారాయణ, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత, పాఠశాల నిర్వాహకుడు ఎస్.మురళీధర్, ప్రిన్సిపాల్ సత్యవతి పాల్గొన్నారు.

తెలుగు భాషను మరువరాదు

మురళీనగర్: తెలుగుభాషను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని విశాఖ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యదర్శి పల్లె నల్లనయ్య అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో మంగళవారం నిర్వహించిన తెలుగుభాషా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యవహారిక భాషా ఉద్యమ కర్త గిడుడు వెంకటరామమూర్తి తెలుగు భాషకు చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కన్వనర్ పెంటకోట రామారావు, అధ్యక్షుడు పాలమరశెట్టి ప్రాన్సిస్, డిపార్టుమెంట్ హెడ్‌లు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, సీహెచ్ జయ ప్రకాష్ రెడ్డి, ప్రశాంతి కుమారి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

రోడ్డు విస్తరణలో మినహాయింపు ఇవ్వండి


మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణలో మసీదులు సమీపంలో ఉన్న షాపులు, ముస్లింల శ్మశాన వాటిక తొలగించకుండా న్యాయం చెయ్యాలని వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజును ముస్లిం పెద్దలు కోరారు. అక్కయ్యపాలెం తాజ్‌బాగ్ మసీదు వద్ద మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఈ విషయమై గతంలో జీవీఎంసీ కమిషనర్‌కు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, జోనల్ మహిళా విభాగం ఇంచార్జి పీలా వెంకటలక్ష్మి, షేక్ జుబేర్, ముస్లిం పెద్దలు రాము, హబీబ్, యాసిన్, అస్లాం, నూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు


గిడుగు వేషధారణలో ఉన్న విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

కంచరపాలెం: కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో తెలుగు విభాగం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లలర్పించారు. వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం జగన్నాథం, తెలుగు ఉపాధ్యాయులు. సీహెచ్.జయలక్ష్మి, పి.సావిత్రి, ఏవీఆర్ ప్రసాద్, సావిత్రి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సీతమ్మధార : ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెం, 80 ఫీట్‌రోడ్డులోని రామచం ద్రనగర్‌లో రెడ్డి రామారావు (40) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామచంద్రనగర్‌లో రామారావు ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య రెడ్డి సంతోష్ కుమారి , ఇద్దరు కుమారులు ఉన్నారు. రామారావు మానసిక పరిస్థితి సరిగా లేదని కొంతకాలంగా మందులు వాడుతున్నాడని భార్య సంతోష్‌కుమారి చెప్పింది. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కేటింగ్‌లో సత్తాచాటుతున్న సాయిసాహితి


సాయిసాహితి

విశాఖ స్పోర్ట్స్ : నగరానికి చెందిన సాయిసాహితి స్కేటింగ్ పోటీల్లో సత్తాచాటుతోంది. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన పసిఫిక్ కప్ ఇన్‌లైన్ ఫ్రీస్కేటింగ్ బాలికల విభాగంలో సాయిసాహితి ద్వితీయస్థానంలో నిలవగా...ఫ్రీ స్కేటింగ్ బాలికల విభాగంలో తృతీయస్థానంలో నిలిచింది. ఫిగర్ స్కేటింగ్ ఓవరాల్‌లో సాయి సాహితి తృతీయస్థానంలో నిలిచింది. ఇప్పటివరకు పన్నెండేళ్ల ప్రాయంలోనే పలు జాతీయస్థాయి పోటీలతో పాటు అంతర్జాతీయ పోటీల్లోనూ తలపడి ఆర్టిస్టిక్ విభాగంలో పలు పతకాలను సొంతం చేసుకుంది. వరల్డ్‌స్కేట్ ఓషియేనియా ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో ఆస్ట్రేలియా,న్యూజిలాండ్, బ్రెజిల్, భారత్, జపాన్, చైనీస్ తైపెయ్, యూఎస్‌ఏ స్కేటర్లు జట్లు పాల్గొన్నాయి.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


సుబ్రహ్మణ్యస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో శ్రావణ మాస శుద్ధత్రయోదశి మంగళవారాన్ని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంద పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ఎన్జీజీవోస్ పాఠశాలకు క్రీడా ప్రతిభ అవార్డు


అవార్డు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

సీతంపేట: జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ చేతుల మీదుగా ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనరస, పీడీ సునంద్‌లు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రతిభ అవార్డు అందుకున్నారు. గోపాలపట్నంలోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో క్రీడల్లో ప్రతిభ చూపిన పాఠశాలలకు అవార్డులు అందజేశారు. 46 పాయింట్లతో ఆటల్లో జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీహైస్కూల్ అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా జేసీ విశ్వనాథన్ పతకాలు సాధించిన క్రీడాకారులను, పాఠశాల హెచ్ఎం, పీడీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ జూన్ గెలెట్ పాల్గొన్నారు.

మార్కెట్లో రాఖీ సందడి


రాఖీలు కొనుగోలు వినియోగదారులు

మద్రిపాలెం: రక్షాబంధన్ సందర్భంగా మద్రిపాలెం మార్కెట్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు రాఖీ విక్రయాలు కొనసాగాయి. అధిక సంఖ్యలో మహిళలు రాఖీలు కొనుగోలు చేశారు. అలాగే మిఠాయి షాపుల్లో కూడా రద్దీ ఏర్పడింది. రూ.10 నుంచి 100 వరకు సరికొత్త డిజైన్లతో రాఖీలు ఉన్నాయని విక్రయదారులు చెప్పారు.

రైల్వే ఉద్యోగి మృతి

సీతమ్మధార: రైల్వే ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే సీనియర్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్‌గా కె.వేంకటేశ్వరావు పనిచేస్తున్నారు. ఏవీఎన్ కళాశాల సమీపంలో డెంకాడ వీధిలో నివాసముంటున్నారు. భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఫిర్యాదు రావడంతో వేంకటేశ్వరరావుతోపాటు మరో ఉద్యోగి వెళుతున్నారు. మార్గ మధ్యలో సమస్య పరిష్కారం అయిందని ఫోన్ రావడంతో తిరిగి ఆఫీసుకు చేరుకున్నారు. బైక్ స్టాండ్ వేస్తున్న సమయంలో వేంకటేశ్వరరావు వెనక్కు పడిపోయాడు. వెంటనే తోటి ఉద్యోగి రైల్వే ఆస్పత్రికి తీసుకువెళ్లేసరికి అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు వెంకట పృథ్వీ ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ శివకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ లబ్ధి


సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, పీలా వెంకటలక్ష్మి

సీతంపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్ 2 సచివాలయం పరిధిలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన వార్డు ఇంచార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ చంద్రబాబు అండ్ కంపెనీ కలిసి చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలెవరూ నమ్మడం లేదని, వాళ్ల అధికారంలో ఉన్నపుడు మాటలు మాత్రమే చెప్పేవారని, జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం తాను చెప్పింది చేతల్లో చేసి చూపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల పాలనలో సంక్షేమం కాగితాలపై మాత్రమే ఉండేదని, జగనన్న పాలనలో ప్రజల చేతికి పూర్తిగా అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ అనిల్ కుమార్‌రాజు, పార్టీ నాయకులు పోతు సత్యనారాయణ, 45వ వార్డు అధ్యక్షులు పైడి రమణ, డైరెక్టర్లు పాండవ శ్రీను, రాయుడు శ్రీను, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్ రెడ్డి, స్థానిక నాయకులు శేషు, అమ్మాజి, శ్యామల, గంట్రేటి రవి, యం.సునీల్, బాబ్‌జాన్, నవాబ్, అను , సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద రూ.39.40 లక్షల వ్యయంతో రెండు సచివాలయాలకు నూతన భవనాలు నిర్మించారు. వార్డు ఇంచార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్స్ అనిల్‌కుమార్ రాజు, ఆళ్ళ లీలావతి, పార్టీ నాయకులు పోతు సత్యనారాయణ, బులుసు జగదీష్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఈఈ శ్రీనివాస్, డీఈ శ్రీనివాసరాజు, ఏఈ శ్రీరామమూర్తి, స్థానిక నాయకులు పాండవ శ్రీను, బొడ్డేటి కిరణ్, గంట్రేటి రవి, అమ్మాజి, శేషు, నవాబ్‌ం యం.సునీల్, శ్యామల, బాబ్‌జాన్, రాయ్, రాము, గౌస్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన


మధురానగర్ జీవీఎంసీహైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్లు

సీతంపేట: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.విశ్వామిత్ర ఆధ్వర్యంలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా సీతంపేట మధురానగర్‌లో ఉన్న జీవీఎంసీ హైస్కూల్‌లో ×నేత్రదానం, ఆవశ్యకత×పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ నేత్ర వైద్యశాఖ సిబ్బంది, ఐ డొనేషన్ కౌన్సిలర్లు స్కూల్‌లో చదువుతున్న 9,10 తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేత్రదానం ఆవశ్యకతను వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం డి.శాంతికుమారి, ఐడినేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, టెక్నీషియన్ హుస్సేన్ పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ


కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ విశాఖవ్యాలీ ప్రతినిధులు

సీతమ్మధార : రోటరీ క్లబ్ విశాఖవ్యాలీ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. సీతమ్మధారలోని జీవీఆర్ రెసిడెన్సీలో జరిగిన కార్యక్రమంలో 12 మంది మహిళలకు కుట్టు మెషీన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆసరా చారిటబుల్ సొసైటీ, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా గుర్తించిన లబ్ధిదారులకు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్, కె.రమాప్రభ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు రోటరీ అందించిన సహకారం ఎంతో ప్రయోజనం కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వీసీసీ జిల్లా కన్వీనర్ కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు

మురళీనగర్: దేశం గర్వించదగ్గ క్రీడాకారుడు, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ సింగ్ అని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నడరసింహారావు అన్నారు. ధ్యాన్‌చంద్ సింగ్ జయంతిని పురస్కరిం చుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని కాలేజీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేసిన గొప్ప క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ అని అన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అబ్బాస్ బేగ్ పాల్గొన్నారు.

79 డిఫెన్స్ మద్యం బాటిళ్ల స్వాధీనం


మద్యంతో యువకుడు

సీతమ్మధార : బాలశాస్త్రి లే అవుట్‌లోని ఓ ఇంట్లో డిఫెన్స్ మద్యం అక్రమంగా అమ్ముతున్నట్టు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. 79 మద్యం బాటిల్స్‌తో పాటు నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది, పోలీసులు సోదాలు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఎస్ఈబీ సర్కిల్–3కి అప్పగించినట్లు తెలిపారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు


బలగా ప్రభాకర్ (ఫైల్)

మద్రిపాలెం: పనికి వెళ్లిన తన భర్త నాలుగు రోజులుగా కనిపించడం లేదని కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పట్టాభిరెడ్డితోట మాణిక్యాంబ కాలనీలో నివసిస్తున్న బలగా ప్రభాకర్ రెండేళ్ల నుంచి అరకులో తాపీ పనులకు వెళుతున్నాడు. నెల రోజులుగా పనులు లేకపోవడంతో మురళీనగర్‌లో పనులకు వెళ్లేవాడు. అరకులో తాపీ పనుల కోసం ఈ నెల 25న వెళ్లాడు. అప్పటి నుంచి అందుబాటులో లేకపోవడం, ఫోను కూడా స్విచ్‌ఆఫ్ కావడంతో భార్య బలగా జ్యోతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్. సాయి నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.